క్లుప్తంగా

ప్రభుత్వ పశువుల ఆసుపత్రిని పాలీక్లినిక్‌గా మార్చాలి



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం ప్రభుత్వ పశువుల ఆసుపత్రిని పాలీక్లినిక్‌గా మార్చి శస్త్రచికిత్సలను అందుబాటులోకి తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. మీకోసంలో సోమవారం కలెక్టర్ డీకే బాలాజీకి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. పశువులకు శస్త్రచికిత్స అవసరమైనప్పుడు గన్నవరం వెటర్నరీ ఆసుపత్రికి సిఫార్సు చేస్తున్నారని, పాలీక్లినిక్‌గా మార్చి నిరుపయోగంగా ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆసుపత్రి ప్రాంగణంలో జనరిక్ మందుల దుకాణాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ నాయకులు జన్ను గోవింద్, ధనికొండ చిన్ని, భోగిరెడ్డి సుభానీ, ఎం.రామరాజు తదితరులు ఉన్నారు.

25న విజయవాడలో ఉపాధ్యాయుల మహాధర్నా

మచిలీపట్నంఅర్బన్: స్థానిక యూటీఎఫ్ భవనంలో ఉపాధ్యాయులు సోమవారం చలో విజయవాడ గోడపత్రికను ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు లెనిన్, శ్రీధర్, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ పాత పింఛను హక్కు సాధన కోసం సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎస్ ఫోరం డీఎస్సీ 2003 నాయకులు డి.మహీపాల్, ఎ.సుధాకర్, సత్యనారాయణమూర్తి, మల్లికార్జునరావు, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, లత, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల వారికి నిత్యావసరాలు పంపిణీ



కృత్తివెన్ను: మరణించిన తన కుమారుడు వంశీకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం సోమవారం కృత్తివెన్ను ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు కూనసాని గరుడప్రసాద్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పీహెచ్‌సీలలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడంతో పాటు, నిరుపేదలైన నిలువనీడ లేని సంచార జాతులకు చెందిన వారికి ఆహారపదార్థాలతో పాటు నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు సాయిసందీప్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కూనసాని వాసు, గోపిశెట్టి ఆలుబాబు ఉన్నారు.

ముంపు పొలాలను పరిశీలించిన ఉద్యానశాఖ అధికారి

చల్లపల్లి: ఉద్యానవన శాఖ అధికారి కీర్తి సోమవారం మండల పరిధిలోని నడకుదురు ప్రాంతంలోని కరకట్ట దిగువున ఉన్న పసుపు, కంద, అరటి పొలాలను పరిశీలించారు. ఇటీవల వరద ముంపు, వర్షాలకు కొన్ని ఉద్యాన, వాణిజ్య పంటలు ముంపునకు గురయ్యాయి. రైతులతో మాట్లాడి వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నడకుదురు కట్ట దిగువన 25 ఎకరాలు ముంపునకు గురయినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. మిగిలిన ప్రాంతాలను కూడా పరిశీలించి పంట నష్టం అంచనాలను నమోదు చేస్తామని వివరించారు.

నేడు 108 కేజీల పసుపు కొమ్ములతో శివయ్యకు మహాభిషేకం

నాగాయలంక: స్థానిక శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలోని స్వామివారి శివలింగానికి మంగళవారం 108 కేజీల పసుపు కొమ్ములతో మహాభిషేకం నిర్వహిస్తు న్నట్లు క్షేత్రం కమిటీ ప్రతినిధి ఉప్పల లీలాకృష్ణప్రసాద్(బుజ్జి), అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు కొమ్ములతో భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం కల్పించామని, అధిక సంఖ్యలో పాల్గొని శివయ్య మహాభిషేకం ఆధ్యాత్మిక వేడుకను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

గూడూరు: ఈనెల 19 నుంచి మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గూడూరు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.వి.రామకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా మంగళ, బుధ, గురువారాలలో మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల, శుక్ర, శనివారాలలో రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. శిబిరాలలో చిన్నారులకు కొత్త కార్డులు నమోదుతో పాటుగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తామని తెలిపారు.

రైతుల ముఖాలు చూసి కట్టలు ఇస్తున్నారు!

అస్మదీయులైతే ఒకలా... తస్మదీయులైతే ఒకలా...

- ఐదెకరాలుందని చెప్పినా రెండున్నర కట్టలే ఇచ్చారని వాపోయిన ఎంపీపీ వాణి
- రుణాలున్న వారికే యూరియా ఇస్తామనడంపై సభ్యుల ధ్వజం
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు

"యూరియా కోసం ఆధార్ కార్డు ఇచ్చి పంపిస్తే తప్పనిసరిగా యజమాని ఉండాలని అనడంతో గురువిందగుంట పీఏసీఎస్‌కు నేనే స్వయంగా వెళ్లా...ఆధార్ కార్డు చూపించి ఐదెకరాలుందని, రెండున్నర కట్టలు ఇవ్వాలని అడిగితే ఒక కట్ట మాత్రమే ఇచ్చారు. అదే పీఏసీఎస్‌లో కొందరు ఐదారు కట్టలు కూడా తీసుకువెళ్లిన వారున్నారు."
- రాజులపాటి వాణి, ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి

పెడన: యూరియా కట్టలు కావాలంటే స్వయంగా పొలం యజమానిని రమ్మంటున్నారని, తీరా వెళితే ముఖాన్ని చూసి మనిషిని బట్టి ఇస్తున్నారని, తమ వారైతే ఒకలా, వేరే వారైతే మరోలా ఇస్తున్నారని ఎంపీపీ రాజులపాటి వాణి ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాజులపాటి వాణి మాట్లాడుతూ యూరియా కోసం తాను స్వయంగా వెళితే ఐదెకరాలు ఉందని చెప్పినా రెండున్నర కట్టలే ఇచ్చారని, అదే వేరేవారికి ఐదారు కట్టలు కూడా ఇచ్చారని ఆరోపించారు. రుణాలు పొందిన వారికే యూరియా ఇస్తామనడం దారుణమని కొంకేపూడి సర్పంచ్ దావు భైరవలింగం అన్నారు. ఒకసారి తీసుకువెళ్లిన వారే మళ్లీ మళ్లీ తీసుకువెళుతున్నారని అన్నారు. ఆన్‌లైన్ చేయకపోవడం వలనే ఇలాంటి ఇబ్బందులు వస్తున్నాయని, ఇకనుంచి ఆన్‌లైన్ ద్వారానే యూరియా సరఫరా చేస్తామని ఏవో జెన్నీ సమాధానం ఇచ్చారు. మండలంలో 22,339 ఎకరాలు వరి సాగు అవుతుందని, ఇందులో 13,543 ఎకరాలు వెద సాగు వేయగా 6,019 ఎకరాలు నాట్లు ద్వారా సాగు చేస్తున్నారని ఏఓ తెలిపారు. మరో 2,037 ఎకరాలు ఇంకా నాట్లు వేయలేదని వివరించారు. మండలానికి ఎంత యూరియా వచ్చిందని భైరవలింగం ప్రశ్నించగా పీఏసీఎస్‌ల ద్వారా 462 టన్నులు మాత్రమే వచ్చాయని, ప్రైవేటు ఎరువుల దుకాణం ద్వారా 752 టన్నులు వచ్చాయని వివరించారు. కొంకేపూడి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసినందుకు సంతోషమని, అయితే ఆ పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కొంకేపూడి సర్పంచు భైరవలింగం ఎంఈఓ–2 హరనాథ్‌కు విన్నవించారు. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హామీ ఇచ్చారు.

నందమూరులో తాగునీటి సమస్య పరిష్కరించాలి

నందమూరు గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ బొల్ల ఉదయ్‌కుమార్, సర్పంచ్ పరసా నరసింహారావు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ నాగేశ్వరరావును కోరారు. జెడ్పీ నిధులతో గ్రామానికి రెండు సంపులు మంజూరయ్యాయని, సరైన స్థలం చూపితే సంపులు నిర్మాణం చేపడతామని ఏఈ చెప్పారు. అయితే అసలు నీరే రాని చోట సంపులు నిర్మాణం ఎందుకని సర్పంచ్ ప్రశ్నించారు. ఉప్పలకలువగుంట స్కీం నుంచి నీరు రాదని, పుల్లపాడు నుంచి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏఈ వారికి హామీ ఇచ్చారు. సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్చుతరావు, వైస్ ఎంపీపీ యాదం రెడ్డి వరప్రసాదరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో కేపీఎస్ ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పిట్టల్లంకలో రెవెన్యూ గ్రామసభ

కోడూరు: మండలంలోని పిట్టల్లంక గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి సోమవారం తెలిపారు. పిట్టల్లంక రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూముల రీసర్వే పూర్తి కావడం, తాజాగా సర్వే ఆధారంగా సిద్ధంగా చేసిన డ్రాఫ్ట్ ఆర్ఓఆర్ రికార్డును జిల్లా కలెక్టర్ ఆమోదించినట్లు చెప్పారు. సర్వే వివరాలు వెల్లడించేందుకు ఉదయం 11 గంటలకు స్థానిక సచివాలయం వద్ద గ్రామసభను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మరో మూడు రోజుల పాటు బీచ్ గేట్లు మూసివేత

కోడూరు: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరో మూడు రోజుల పాటు హంసలదీవి బీచ్ గేట్లను మూసివేయనున్నట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ నాగమణి సోమవారం తెలిపారు. అల్పపీడనం ప్రభావం నేపథ్యంలో ఇప్పటికే మూడు రోజుల నుంచి బీచ్ గేట్లను మూసి వేశామని చెప్పారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కొనసాగడంతో ఈ నెల 21 వరకు బీచ్ గేట్లను మూసి ఉంచనున్నట్లు తెలిపారు. పర్యాటకులు అటవీ అధికారులకు సహకరించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌కు తక్షణం సమాచారం ఇవ్వండి



మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

పెడన: మండలంలోని తమ పరిధిలో ఎప్పుడు ఏం జరిగినా తక్షణం సమాచారం అందేలా నడుచుకోవడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌కు కూడా వెంటనే సమాచారం తెలియజేయాలని పెడన ఎస్ఐ జి.సత్యనారాయణ అన్నారు. ఇటీవల బదిలీపై వచ్చి కొత్తగా బాధ్యతలను చేపట్టిన వార్డు, గ్రామ సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు(మహిళా పోలీసులు)తో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, ఏమైనా సందేహాస్పదంగా పరిస్థితులుంటే తక్షణం సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాలలు వద్ద ఎవరైనా ఉచితంగా చాక్లెట్లు ఇస్తున్న సందర్భాలు ఏమైనా ఉన్నాయోమోననే పరిశీలించాలని ఆదేశించారు. మీ పరిధిలోని డ్వాక్రా గ్రూపు మహిళలతో నిత్యం సమావేశాలు నిర్వహిస్తూ వారి పిల్లల మనస్తత్వాలు, నడవడికలో ఏమైనా మార్పులు వస్తున్నదీ అడిగి తెలుసుకోవాలన్నారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాల్సి ఉందని, అందుకు మీ సహకారం కూడా అవసరమన్నారు. ఎక్కడ పందిరి ఉన్నా ఆ సమాచారం ఇవ్వాలని తెలిపారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ కాన్ఫరెన్సులోకి వచ్చి దిశానిర్దేశం చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): కళాశాలల్లో జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. కృష్ణా యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకం వల్ల యువత చెడు మార్గాలు పట్టే ప్రమాదం ఉందని, వాటిని అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రమేష్‌బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, రిజిస్ట్రార్ ఎన్.ఉష, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి ముసలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కేవీకేలో విస్తరణ అధికారులకు శిక్షణ

ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో మొవ్వ సబ్ డివిజన్ పరిధిలోని విస్తరణ అధికారులకు వరిపంట సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం, కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ రసాయనేతర పద్ధతులు అవలంబించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. డీడీఏ జ్యోతి రమణి మాట్లాడుతూ భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం తప్పనిసరని చెప్పారు. వరిలో చేపట్టాల్సిన ఎరువులు, కలుపు యాజమాన్యంపై సస్యపోషణ శాస్త్రవేత్త వెంకటలక్ష్మి తెలపగా, వరిలో ఆశించే చీడపీడల యాజమాన్య పద్ధతులను, ఎలుకల యాజమాన్యంలో చేపట్టాల్సిన మెలకువలను సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు శ్యామల, శ్రీనివాసరావు, ఏవో పద్మజ, ఇతర ఏవోలు, వీఏఏలు పాల్గొన్నారు. అనంతరం వయ్యారి భామ అవగాహన వారోత్సవాల్లో భాగంగా వయ్యారి భామ కలుపు మొక్క దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి ర్యాలీ చేశారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులకు సత్కారం

నాగాయితిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయితిప్ప ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రం త్రిసభ్య కమిటీ అభినందన సభ సోమవారం నిర్వహించారు. సొసైటీ చైర్ పర్సన్ బల్లా సీతారామ ప్రసాద్, పర్సన్‌లు రేపల్లె మునేశ్వరరావు, గరికిపాటి రాఘవరావులను శాలువాలు కప్పి, పూల దండలతో ఘనంగా సత్కరించారు. తొలుత మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం వద్ద టెంకాయలు కొట్టి, పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా పీఏసీఎస్‌కు చేరుకున్నారు. జనసేన నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, బొబ్బా గోవర్ధన్, టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కొల్లు పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ బాధ్యతల స్వీకారం

గూడూరు: నూతనంగా నియమితులైన మండల పరిధిలోని ముక్కొల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రీమెన్ కమిటీ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్‌గా సమ్మెట రాఘవ ప్రసాద్, పర్సన్‌లుగా శాకల మహంకాళరావు, ముక్కు సుబ్రహ్మణ్యేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో రైతులు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

కొడాలి(ఘంటసాల): పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తూ రైతులకు నాణ్యమైన సేవలందించాలని పలువురు వక్తలు తెలిపారు. ఘంటసాల మండలం కొడాలి పీఏసీఎస్ త్రిసభ్య నూతన కమిటీ సోమవారం బాధ్యతలు స్వీకారం నిర్వహించారు. కమిటీ చైర్‌పర్సన్‌గా గుత్తికొండ వర ప్రసాద్, పర్సన్లుగా కంఠమనేని రాజగోపాలరావు, వేములపల్లి ప్రకాశరావు చేత ఘంటసాల కేడీసీసీ మేనేజర్ ఎస్.శిరీష కార్యదర్శి టి.ఆదినారాయణతో కలసి ప్రమాణ స్వీకారం చేయించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీ వారిని టీడీపీ నేతలు, ఘంటసాల బ్యాంకు సూపర్ వైజర్ జె.రాజశేఖర్, సిబ్బంది దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఫోన్ పే చేస్తానని చెప్పి రూ.2 వేలకు టోకరా!

చల్లపల్లిలో కొత్త తరహా మోసం

చల్లపల్లి: మారుతున్న సాంకేతిక పరి/జ్ఞానానికి అనుగుణంగా మోసగాళ్లు కూడా తమ పంథాను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ కొత్త పద్ధతుల్లో చోరీలకు తెర లేపుతున్నారు. తాజాగా ఫోన్‌పే పేరు చెప్పి డబ్బులు తీసుకుపోయే కొత్త తరహా దొంగతనం వెలుగులోకి వచ్చింది. చల్లపల్లి పడమర వీధిలో కొత్తగా పెట్టిన ఓ బడ్డీ కొట్టు వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం వచ్చాడు. కూల్‌డ్రింక్స్ ఉన్నాయా అని అడిగి నాలుగు బాటిల్స్ సంచిలో పెట్టి ఉంచమని చెప్పాడు. తాను పక్కనున్న టిఫిన్ హోటల్లో 25 ప్లేట్లు టిఫిన్ ఆర్డర్ ఇచ్చానని అక్కడ ఫోన్‌పే పనిచేయటం లేదని రూ.2వేలు క్యాష్ ఇస్తే ఆ మొత్తాన్ని, కూల్‌డ్రింక్స్ డబ్బును రెండింటినీ కలిపి ఫోన్‌పే చేస్తానని బడ్డీ నిర్వాహకురాలికి నమ్మబలికాడు. దీంతో ఆమె రూ.2వేలు డబ్బులు ఇచ్చింది. డ్రింక్స్ సంచిలో పెట్టి ఉంచమని, ఈలోపు తాను టిఫిన్ హోటల్లో బిల్లు కట్టి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికీ అతను రాకపోయేసరికి ఆమె హోటల్ దగ్గరకు వెళ్లి ఆరా తీయగా, తమకు ఎవరూ టిఫిన్ ఆర్డర్ ఇవ్వలేదని చెప్పటంతో తాను మోసపోయానని గ్రహించింది. ఇటీవలే భర్తను కోల్పోయి వారం రోజుల క్రితమే కొత్తగా బడ్డీ కొట్టు పెట్టుకుని జీవిస్తున్న ఆమె పాపం.. ఈ విధంగా మోసపోయింది.

కల్యాణమస్తు పథకం ద్వారా బంగారు నాణెం బహూకరణ

ఘంటసాల: పాల ఉత్పత్తిదారులకు కృష్ణామిల్క్ యూనియన్ అండగా ఉంటుందని క్లస్టర్ మేనేజర్ గోపీనాథ్ అన్నారు. ఘంటసాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాలు ఉత్పత్తిదారుడైన లోయ శ్రీనివాసరావు కుమార్తె మౌనిక వివాహం సందర్భంగా కల్యాణమస్తు పథకం కింద రూ.20 వేల విలువైన బంగారు నాణాన్ని సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్ సోమవారం అందించారు.

తొలగని ముంపు–రానున్న మరో ముప్పు



కరకట్ట దిగువన రాముడుపాలెం వద్ద నీటిలో మునిగిన అరటి పిలక



నాదెళ్ళవారిపాలెం వద్ద ముంపులో మగ్గుతున్న కంద పంట

- పోయేదెంత.... దక్కేదెంత!
- ఆందోళనలో కరకట్ట దిగువ రైతులు



వరద తగ్గటంతో ముంపు నుంచి బయటపడి బురదలో నానుతున్న పసుపు పంట



నాగాయలంక చోడవరం పర్రలో కుళ్ళిపోతున్న వరి పైరు

చల్లపల్లి: భారీ వర్షాలు, వరద కారణంగా కరకట్టకు దిగువన ఉన్న వాణిజ్య పంటలు ఇంకా ముంపునీటిలోనే మగ్గిపోతున్నాయి. మూలిగే నక్కమీద తాటికాయ పడిన చందంగా, అధికారులు మళ్లీ అల్ప పీడనం అని ప్రకటించటం, ప్రకాశం బ్యారేజీ నుంచి మరలా వరద నీరు వదులుతుండటంతో కరకట్ట దిగువ రైతులు అతలాకుతలమవుతున్నారు. కరకట్ట దిగువన మండల పరిధిలోని నడకుదురు, రాముడుపాలెం, నిమ్మగడ్డ, వెలివోలు, ఆముదార్లంక, లచ్చిగానిలంక, నాదెళ్ళవారిపాలెం ప్రాంతాల్లో అరటి, పసుపు, కంద వంటి పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం సీజన్‌లో పసుపు 300 ఎకరాలు, అరటి 120, కంద 75, కూరగాయలు 70, బొప్పాయి 30 ఎకరాలు అన్నీ కలిపి 595 ఎకరాల్లో ఉద్యాన, వాణిజ్య పంటలు సాగుచేస్తున్నారు. గత ఏడాది పసుపు పంట పోవటంతో ఈ ఏడాది పసుపు విత్తనాన్ని తెలంగాణ ప్రాంతంలోని నిజామాబాద్ నుంచి తీసుకువచ్చారు. 76 కిలోల బస్తా ఒక్కొక్కటి రూ.2500 చొప్పున ఎకరాకు 15 బస్తాలు విత్తనం నాటినట్లు రైతులు చెపుతున్నారు. దీంతో పసుపు విత్తనానికే ఎకరాకు రూ.37,500 ఖర్చు అయింది. దీనికితోడు దుక్కులకు రూ.5వేలు, కూలీలకు రూ.15వేలు, పిండికి రూ.7వేలు మొత్తం కలుపుకొని ఒక్క ఎకరా పసుపు సాగు చేయటానికి ఇప్పటి వరకూ ఎకరాకు రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెపుతున్నారు. ఇక కంద విషయానికొస్తే ఇప్పటికే ఎకరాకు రూ.3.50 లక్షలు ఖర్చు అయిందని, అరటికి ఎకరాకు రూ.50 వేలు అయినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వారం రోజుల నుంచి తమ పంటలు నీటిలో మునిగి ఉండటంతో ముఖ్యంగా పసుపు, కంద దుంపలు కుళ్లిపోయి పంట పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత వరకైనా పంట తేరుకుంటుందేమో అనుకుంటున్న సమయంలో మరలా రేవులో వరద, మరో పక్క భారీ వస్తున్నాయని హెచ్చరికలు చేయటంతో తాము నిండా మునిగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతున్నారు. తమ పంటలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని ఆయా ప్రాంత రైతులు ప్రభుత్వానికి ఏకరువు పెడుతున్నారు.

నీటిలో నాని కుళ్లిపోతున్న వరి పైరు

నాగాయలంక: మండలంలోని పలు ప్రాంతాల్లో వరి పొలాలు జలాశయాలుగా మారాయి. అయిదు రోజుల గడిచినా మునక నుంచి బయటపడక పైరు కుళ్లిపోతోందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చోడవరం పర్రలో వర్షం నీటి మునకలో కుళ్లిన పైరు బయటకు తీసి చూపుతూ రైతులు గగ్గోలు పెడుతున్నారు.

79 మంది దివ్యాంగుల పెన్షనర్లకు నోటీసులు

ఘంటసాల: మండలంలో జరిగిన డీఎంఅండ్‌హెచ్‌ఓ పెన్షన్ల పూర్వపు వెరిఫికేషన్‌లో 13 సచివాలయాల పరిధిలో 79 మంది దివ్యాంగులకు నోటీసులు అందించినట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు సోమవారం తెలిపారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 79 మందికి సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా నోటీసులు అందించామన్నారు. నోటీసులపై అభ్యంతరాలు ఉంటే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు (జీజీహెచ్), జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల్లో వారి అర్హతను ధ్రువీకరించడానికి మాన్యువల్ మెడికల్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. నోటీసులు అందిన 30 రోజుల్లోపు దరఖాస్తుదారుడు వైద్య ధ్రువీకరణ పత్రం, సంబంధిత పత్రాలతో కూడిన అప్పీలు లేఖను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. సవరించిన సదరమ్ సర్టిఫికెట్ ప్రకారం వైకల్య స్థితి ఆధారంగా అర్హత కలిగిన వ్యక్తులకు పెన్షన్ పునరుద్ధరిస్తామని ఎంపీడీవో సుబ్బారావు తెలియజేశారు.

335 మంది దివ్యాంగులకు నోటీసులు

మోపిదేవి: మండలంలో 335 మంది దివ్యాంగులకు పింఛను ఎందుకు తొలగించరాదో చెప్పమంటూ నోటీసులు జారీ చేశారు. మండలంలోని 13 పంచాయతీల పరిధిలో పలు రకాల దివ్యాంగుల ఫింఛన్ దారులు 980 మంది ఉండగా, వారిలో 453 మందిని అర్హత లేనివారుగా గుర్తించారు. ఈ 453 మందిలో 118 మందిని వేరే పింఛనుదారులుగా మార్పు చేశారు. మిగిలిన 335 మందికి పూర్తిగా పింఛను తొలగిస్తూ అధికారులు నోటీసులు జారీ చేశారు. వారికి నోటీసులు కూడా జారీ చేశామని చెప్పారు. ఈ మార్పు సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వస్తుందని వివరించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం



నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలో మండపంలోకి ప్రవేశించిన వరద ప్రవాహం

నాగాయలంక: ఈనెల 20వ తేదీ నాటికి కృష్ణానదికి ఎగువన ప్రకాశం బ్యారేజీ వద్ద 7లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున నాగాయలంక మండలంలో ప్రజలందరూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండలం తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ సోమవారం హెచ్చరించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని చెప్పారు. భారీ వర్షాల సూచనల నేపథ్యంలో ముందస్తు చర్యగా మండలంలోని గ్రామాల్లో టాంటాం వేయించి ప్రజలకు తెలియజేయాల్సిందిగా వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దారు చెప్పారు. మరోవైపు శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్‌లో కృష్ణానది వరద ప్రవాహం సోమవారం మరింత పెరిగింది. ఘాట్‌లోని కృష్ణవేణి మాత విగ్రహం, రామలింగేశ్వరుని మండపం దాటుకుని వరద ప్రవాహం ముందుకు దూసుకు వచ్చింది. క్రమక్రమంగా వరద నీటి మట్టం పెరుగుతూ ఉంది.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పెడన: ఒంగోలులో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, రాష్ట్ర రైతు సంఘ నాయకుడు కె.వి.ప్రసాద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సర్వోదయ చేనేత సొసైటీలో సోమవారం ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ మహాసభలకు అఖిల భారత జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నంగేగడ్డ షిరిడీ సాయి సేవాశ్రమం వార్షిక వేడుకలు



నాగాయలంక: మండలంలోని నంగేగడ్డ షిరిడీ సాయి బాబా సేవాశ్రమం 23వ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారం ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలుత పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు దివ్యాశీస్సులతో బాబావారి ఊరేగింపు సాయిబాబా మందిరం నుంచి ప్రారంభమైంది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన సాయి సేవకులు, భక్తులు, గురువు సాంబశివరావు, బాబావారి చిత్రపటాలతో నంగేగడ్డ, మర్రిపాలెం, నాగాయలంక గ్రామాల్లో ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా నంగేగడ్డ సేవాశ్రమంలో అఖండ సాయి నామ సంకీర్తన, సాయి మాతలు, సాయి సేవకుల సత్సంగ ప్రసంగాలు, బాబావారికి మహా పుష్పాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.